# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 5 మే 2025 | పేజీలు 8





- జీహెచ్ఎంసిలో అక్రమ కట్టడాలను తీవ్రంగా పరిగణించిన ఉన్నత న్యాయస్థానం..
- పర్మిషన్‌లకు మించి అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకులకు తిలోదకాలు..
- షోకాజ్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్‌లు జారీ చేసినప్పటికీ చర్యలు శూన్యం..
- హైదరాబాద్ షేక్‌పేట్ ఓయు కాలనీలో ఓ అక్రమ కట్టడం ఘటనతో ఆదేశాలు..
- నోటీసులిచ్చిన అధికారులకు చట్టం పట్ల ఏ మాత్రం గౌరవం, భయం లేదని వ్యాఖ్య..
- కూల్చివేతలపై ఎలాంటి ఆందోళన లేకుండా యధేచ్ఛగా నిర్మాణాలు చేపట్టడం ఏంటి..?
- జీహెచ్ఎంసి ఉప కమిషనర్‌లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు..
- తగిన సూచనలు జారీచేయాలని హైకోర్టు జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది..
- షేక్‌పేట్ తరహాలో కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్కిల్‌లు బరితెగింపు..
- ఫాక్స్‌సాగర్ నాలా నడిబొడ్డున అక్రమ నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ సహకారం..
- సూరారం సిద్దివినాయక నగర్‌లోనూ షోకాజ్ నోటీసులు-స్పీకింగ్ ఆర్డర్, చర్యలు శూన్యం..


-2 లో


# జీహెచ్ఎంసికి..!
# హైకోర్టు సంచలన ఆదేశాలు..!

**కోర్టుకేసులు ఉన్నా సరే..!**
**నోటీసులిచ్చిన అక్రమ నిర్మాణాలు సీజ్ చేయండి..**



జీహెచ్ఎంసి పరిధిలోని అన్ని సర్కిల్‌ల నిర్వాకంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.. అదనపు అంతస్తులు, నిబంధనలు పట్టించుకోక పోవడంపై, స్థానికుల ఫిర్యాదులను బేఖాతర్ చేస్తూ..! షోకాజ్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్‌లు జారీచేసిన జీహెచ్ఎంసి చర్యలు తీసుకోకుండా, మొక్కుబడిగా సీజ్ చేసి ఆతర్వాత, అక్రమ నిర్మాణాల్లో యధావిధిగా పనులు చేసుకునే వెసులుబాటును జీహెచ్ఎంసినే కల్పిస్తుందని కోర్టు గ్రహించింది.. రెసిడెన్షియల్ పర్మిషన్‌లు- కమర్షియల్ కాంప్లెక్స్‌లు, సెట్‌బ్యాకుల నిబంధనలకు తిలోదకాలు.. చట్టప్రకారం సీజ్ చేసి ముడుపుల ప్రకారం సహకారం.. జీహెచ్ఎంసిపై హైకోర్టు ఆదేశాలను ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. మహానగర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాల బెడద తీవ్రంగా ఉంది.. ఒక్క జీహెచ్ఎంసి మాత్రమే కాకుండా..! శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో మరీ విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.. మున్సిపల్ శాఖ ఆదిశగా కూడా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 4:**

## ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్టీసీ సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రేపు, ఎల్లుండి ప్రత్యేకంగా తాను ఆర్టీసీ ఉద్యోగుల కోసం హైదరాబాద్లోనే అందుబాటు లోనే ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబా ద్ ఆర్టీసీ బస్ స్టేషన్ ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు బస్టాండ్ లో ప్రయాణికులు,ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ లతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ సమస్యలపై తనతో నేరుగా మాట్లాడవచ్చన్నారు. 'ఆర్టీసీ మా కుటుంబం.. కుటుంబ పెద్దగా సమస్య పరిష్కారం చేసుకుంటాం. సమస్య పరిష్కారానికి మా తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి.


-3 లో


## 60 చదరపు గజాల్లో కడితేనే
## ఇందిరమ్మ ఇండ్లకు బిల్లు






**హైదరాబాద్ పెన్ పవర్:**ఇందిరమ్మ ఇండ్లు 60 చదరపు గజాల్లో కడితేనే బిల్లు మంజూరవుతుందన్నారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఇల్లు మంజూరైన నెలలోపే నిర్మాణం ప్రారంభించా లన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పై రివ్యూ నిర్వహించారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఇందిరమ్మ ఇళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎంపిక చేయాలని ఆదేశించారు. డబుల్ వెరిఫికేషన్ చేసిన తర్వాతే ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారులను ఎంపిక చేస్తామన్నారు.


-3 లో

# జీహెచ్ఎంసికి..! హైకోర్టు సంచలన ఆదేశాలు..!


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
Office of the Dy. Commissioner,
Circle No.26, Kukatpally Zone,
Gajularamaram, Hyd.

Speaking Order issued under TS-bPASS Act 2020 & GHMC Act 1955

No.5066/UC/TPS/C-26/KPZ/GHMC/2024 Dt.27.04.2024

**Sub:** GHMC – T.P.Section – Circle No.26 – Unauthorizedly constructed the Ground floor + 3 upper floors + raised the columns for the 4th floor and not maintaining the mandatory setbacks beside Sri Mallikarjuna Washing Center situated at Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram – Speaking order issued under TS-bPASS Act 2020/ GHMC Act 1955– Regarding.

**Ref:** 1.This office permit No.NIL
2.This Office registered under UCIMS vide UC No.5066.
3.This office Show cause Notice No.5066/UC/TPS/C26/KPZ/ GHMC/2024 dt: 18.04.2024.
4.Your Reply: Nil.

******

Whereas, it is to inform that you have made the following Unauthorizedly constructed the Ground floor + 3 upper floors + raised the columns for the 4th floor and not maintaining the mandatory setbacks beside Sri Mallikarjuna Washing Center situated at Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram, which is contrary to the provisions of TS-Bpass& GHMC Act and Bye- Laws made there under as given below.

Details of the deviations / unauthorized constructions:

1. You have not obtained the building permission from GHMC.
2. You have Unauthorizedly constructed the Ground floor + 3 upper floors + raised the columns for the 4th floor without taking prior permission from GHMC and also not maintaining the mandatory setbacks beside Sri Mallikarjuna Washing Center situated at Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram.
3. This office is directing you to stop the unauthorized construction work and also directing you to not to proceed with any further construction activities.

Photograph of the unauthorized construction:

In this regard, a show cause notice was issued to you vide reference 3rd cited, instructing to submit reply as to why action shall not be taken against the unauthorized construction TS-bPASS Act 2020/ GHMC Act 1955.

Further, it is also to inform that you have not submitted any reply to this office notice, which implies that you do not have any reply to say and you are admitting that the above mentioned unauthorized construction is being done by you knowingly, which is highly offensive and contrary to the provisions of TS-bPASS Act 2020/ GHMC Act 1955.

Hence, you are hereby directed to remove the unauthorized construction within **(15)** days from the date of receipt, failing which same will be removed departmentally and the expenses incurred will be recovered from you.

Dy. Commissioner
Gajularamaram Circle-26, GHMC

To
The Owner/Occupier,
Beside Sri Mallikarjuna Washing Center,
Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram.


- మొదటి పేజి తరువాయి

అక్రమ నిర్మాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, టిజి–బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.. జీహెచ్ఎంసి పరిధిలోని అక్రమ నిర్మాణాలను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ హైకోర్టు, అక్రమంగా నిర్మించిన అన్ని అంతస్తులను వెంటనే సీజ్ చేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది.. హైదరాబాద్ షేక్‌పేట్ ఓయూ కాలనీలో ఓ వ్యక్తి "జీ ప్లస్ 2" అనుమతులు తీసుకుని 3, 4, 5 అదనపు అంతస్తులు, ఆపై పెంట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నారంటూ అందిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ జి.రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు..

దీనిపై విచారణ చేపట్టిన "జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి" జీహెచ్ఎంసీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.. షోకాజ్ నోటీసు జారీ చేసిన వెంటనే జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 461 ఎ కింద ఎందుకు సీజ్ చేయడంలేదో అర్థం కావడంలేదన్నారు.. నోటీసులు జారీ చేసిన తరువాత చట్టం పట్ల ఏ మాత్రం, గౌరవం భయం లేకుండా వ్యవహరిస్తున్నారని..! కూల్చివేతలపై ఎలాంటి ఆందోళన లేకుండా నిర్మాణానాలను కొనసాగిస్తున్నారని హైకోర్టు పేర్కొంది.. ఈ వ్యవహారంలో యజమానులు, బిల్డర్లు, స్థానిక రాజకీయ నాయకులు, అధికారుల మధ్య సంబంధం లేదని చెప్పలేమన్నారు..




సర్కిల్-26 పరిధ సూరారం సిద్దివినాయక నగర్‌లో అక్రమ నిర్మాణం..



నిర్మాణ దశలో స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చి చర్యలు శూన్యం..

## జీహెచ్ఎంసి కమిషనర్‌కి హైకోర్టు ఆదేశాలు..

ఇకపై అనుమతుల్లేని నిర్మాణాలు జరిగినట్లు గుర్తించిన వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయడంతోపాటు అక్రమ నిర్మాణాలకు తక్షణం సీల్ చేయాలని హైకోర్టు ఆదేశించింది.. అనధికారిక నిర్మాణాలను అడ్డుకోవడానికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తరువాత కూల్చివేతకు ఉత్తర్వులు జారీ చేయడం, ఈ మధ్య కాలంలో నిర్మాణాలు కొనసాగించడానికి, నేతల సిఫార్సుల నెపంతో జీహెచ్ఎంసి అనుమతించడం వంటివన్నీ అసంబద్ధంగా ఉన్నాయని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి వ్యాఖ్యానించారు.. డిప్యూటీ కమిషనర్‌లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు తగిన సూచనలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవనాలకు,అదనపు అంతస్తులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలని హైకోర్టు ఆదేశించింది.. జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. అందువల్లనే హైకోర్టులో ఎక్కవ సంఖ్యలో పిటిషన్లు దాఖలవుతున్నాయని పేర్కొంది..

## హైకోర్టు ఆదేశాలతో.. జీహెచ్ఎంసి సర్క్యులర్ అమలు..

హైకోర్టు ఆదేశాలతో, వెంటనే స్పందించిన జీహెచ్ఎంసి మే 1న, జీహెచ్ఎంసి ఈ సర్క్యులర్‌ను శరవేగంగా అమలు చేసింది. అన్ని జోనల్ కమిషనర్‌లకి, డిప్యూటీ కమిషనర్‌లకి, సర్కిల్, వార్డ్ కార్యాలయాలు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఈ సర్క్యులర్ పంపింది, షోకాజ్ నోటీసు జారీ చేసిన తర్వాత, ఏదైనా అనధికార అంతస్తులు లేదా మంజూరైన ప్లాన్లకు భిన్నంగా చేసిన నిర్మాణాలను సీల్ వేయాలని ఆదేశించింది.. పదే పదే షోకాజ్ నోటీసులు జారీ చేయడం పట్ల జస్టిస్ విజయసేన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. "నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా అనధికార నిర్మాణాలు నిరాటంకంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు..

## స్పీకింగ్ ఆర్డర్‌లు జారీచేసి.. చర్యలు శూన్యం..

గాజులరామారం సర్కిల్-26 పరిధి సూరారం 129 డివిజన్ సిద్ది వినాయక నగర్‌లోనూ "5 అంతస్తుల" అక్రమ నిర్మాణానికి "స్పీకింగ్ ఆర్డర్" జారీచేసిన అధికారులు భేరం కుదుర్చుకుని, డబ్బులు దండుకుని, చర్యల విషయాన్నే మరిచారు.. 2024 ఏప్రిల్ 18న షోకాజ్ నోటీసు, ఏప్రిల్ 27న స్పీకింగ్ ఆర్డర్ జారీచేసిన సమయంలో "గ్రౌండ్ ప్లస్ 3" అంతస్తుల "ప్రమాదకర" అక్రమ నిర్మాణాన్ని..! 5 అంతస్తులు నిర్మించి "హాస్టల్ నిర్వహణకి" అద్దెకు ఇచ్చినా నేటికీ చర్యలు శూన్యం.. గాజులరామారం సర్కిల్-26 సూరారం 129 డివిజన్ సిద్దివినాయక నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా..! "గ్రౌండ్+5" అంతస్తులు నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు బహిరంగంగానే సహకరిస్తున్నారు.. సెట్‌బ్యాకులు లేకుండా "గ్రౌండ్ం3" అంతస్తులు నిర్మించి 4వ అంతస్తుకు పిల్లర్‌లు కూడా రైజ్ చేసిన సమయంలో జీహెచ్ఎంసి అధికారులు "షో"కాజ్" నోటీసు నెం.5066/UC/TPS/C26/KPZ/ GHMC/2024 dt: 18.04.2024. జారీచేశారు.. అక్రమార్కుల నుండి సమాధానం రాలేదు.. ఆతర్వాత స్పీకింగ్ ఆర్డర్‌ను 27-04-2024న TS-BPASS చట్టం 2020 అండ్ GHMC చట్టం 1955 కింద స్పీకింగ్ ఆర్డర్ జారీచేశారు.. నెం.5066/UC/TPS/C-26/KPZ/GHMC/2024.. అయితే స్పీకింగ్ ఆర్డర్ జారీచేసే నాటికి "గ్రౌండ్ం3" అంతస్తులతో 4వ అంతస్తుకు పిల్లర్‌లు మాత్రమే ఉండగా..! టౌన్‌ప్లానింగ్ సౌజన్యంతో ప్రస్తుతం, మొత్తం "గ్రౌండ్+5" ఫ్లోర్‌లు పూర్తిచేసి "ఆడపిల్లల హాస్టల్ నిర్వహణకు" అద్దెకు ఇవ్వడం గమనార్హం.. ప్రమాదం సంభవిస్తే తప్పించుకునే అవకాశం లేని తప్పుడు నిర్మాణాలను అధికారులు ప్రోత్సహిస్తున్నారు.. అక్రమార్కులతో భేరం కుదుర్చుకుని హాస్టల్ పిల్లలను అధికారులే ప్రమాదంలో పెడుతున్నారు.. ఈ విషయంపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఐఏఎస్, జీహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

## కళ్ళుమూసుకున్నారా..? ఉద్దేశపూర్వకంగానే చర్యల జాప్యమా..?

అధికారుల తీరుపై జస్టిస్ విజయసేన్ రెడ్డి తీవ్రంగా ప్రశ్నించారు.. అధికారులు కళ్ళు మూసుకుంటున్నారా..? లేక ఉద్దేశపూర్వకంగా చర్యలన ఆలస్యం చేస్తున్నారా..? అంటూ ఆయన వ్యాఖ్యానించారు.. చాలా సందర్భాల్లో పునాది దశలో ఫిర్యాదులు చేస్తున్నారని, కానీ అధికారులు చర్యలు తీసుకోవడానికి మూడు లేదా నాలుగు అంతస్తులు నిర్మించే వరకు వేచి ఉంటారని కోర్టు గమనించింది.. షోకాజ్ నోటీసులకు సమాధానాల కోసం వేచి ఉండటం, నిర్మాణ పనులు ఆపకుండా, నిర్మాణ ప్రాంగణాన్ని మూసివేయకుండా సహకరించడం వల్లనే నిర్మాణాలు సాఫీగా సాగుతున్నాయన్నారు.. మొక్కుబడిగా నోటీసులు జారీ చేయడం, నిర్మాణాన్ని కొనసాగించడానికి అనుమతించే ఈ పద్ధతికి ముగింపు పలకాలి.. జీహెచ్ఎంసి సకాలంలో చర్యలు తీసుకోకపోతే, అది కోర్టు ధిక్కారానికి దారితీయవచ్చని జస్టిస్ విజయసేన్ రెడ్డి హెచ్చరించారు.. కోర్టు విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, అనధికార అంతస్తులను ప్రారంభ దశలోనే కూల్చివేయడమనేది సరైనదని తెలిపారు..




ఫాక్స్‌సాగర్ నాలాపై 2024 ఆగష్టు 16న సీల్ వేశారు.. అయినా నిర్మాణం పూర్తి చేసిన వైనం..




సర్కిల్-25 పరిధిలో ఫాక్స్‌సాగర్ నాలా నడిబొడ్డున అక్రమ నిర్మాణం..

# ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం

- మొదటి పేజి తరువాయి

ఆర్టీసీ వాళ్లు ఎవరు వచ్చిన చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. కష్టాల నుండి ఆర్టీసీ బయటపడుతుం ది. ఇప్పుడిప్పుడే మన సమస్యలు దశలవారీ గా పరిష్కరిస్తున్నాం. మీరు ఎప్పుడు వచ్చిన నేను చర్చలకు సిద్ధంగా ఉన్నం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# 60 చదరపు గజాల్లో కడితేనే ఇందిరమ్మ ఇండ్లకు బిల్లు

- మొదటి పేజి తరువాయి

ఒకే కుటుంబంలో ఇద్దరికీ ఇల్లు మంజూరు చేయబోమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పుల పాలయ్యిందన్నారు వివేక్ వెంకటస్వామి. కేసీఆర్ రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఫైర్ అయ్యారు. చెన్నూర్ మండలంలోని సోమనపల్లి లో రూ. 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు ఎమ్మెల్యే వివేక్.

# రైతులు అధైర్య పడొద్దు.. నష్టపరిహారం అందేలా కృషి చేస్తా.. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్ పెన్ పవర్:మంచిర్యాల జిల్లా బీమారం మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే వివేక్. రైతులు ఎవరూ అధైర్య పడొద్దని.. నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని అన్నారు. గత రెండు రోజుల క్రితం గాలివాన బీభత్సంతో పంట పొలాలు, విద్యుత్ స్తంభాలు,చెట్లు విరిగిపోవడం,చేతికొచ్చిన పంట నెలరాలడంతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు రైతులు.నష్టపోయిన ప్రతి ఒక్క రైతులు ఆదుకుంటామని.. తాను ఎమ్మెల్యే గా గెలిచిన తర్వాత కాళేశ్వరం బ్యాక్ వాటర్ తో నష్టపోయినా రైతులకు నష్టపరిహారం ఇప్పించానని అన్నారు ఎమ్మెల్యే వివేక్. ప్రకృతి వైపరీత్యాన్ని ఎవరు ఆపలేరని.. పెద్ద ఎత్తున పంటలు దెబ్బ తినడం బాధాకరమని అన్నారు.దెబ్బతిన్న ఇండ్లను,పంటలను మరోసారి అధికారులు రీ సర్వే చేయాలని.. జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలనే కోరారు ఎమ్మెల్యే వివేక్. రైతులు ఎవరు ఆ ధైర్యపడొద్దని.. నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని అన్నారు ఎమ్మెల్యే వివేక్.

# 5 కారు ఇన్సూరెన్స్ సీక్రెట్స్.. 90% మంది తెలియక చేసే తప్పులివే..




హైదరాబాద్ పెన్ పవర్:ప్రస్తుతం చాలా మంది మధ్యతరగతి ప్రజలు సైతం జీవన ప్రమాణాలు, ఆదాయం పెరుగుదలతో కార్లను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇక్కడ చాలా మంది కారుకు ఇన్సూరెన్స్ తీసుకుంటుంటారు. అయితే ఆ తర్వాత చేసే కొన్ని తప్పులు వారికి ఖరీదైనవిగా మారుతున్నాయి. ఇవి వారి ఇన్సూరెన్స్ క్లెయిన్స్ రిజెక్ట్ కావటం, ఎక్కువ ప్రీమియం చెల్లింపులకు దారితీస్తున్నాయి. అయితే వీటి గురించి సహజంగా చాలా మందికి అస్సలు తెలియదు. అందుకే ఐదు కార్ ఇన్సూరెన్స్ సీక్రెట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం రండి...

ఒకవేళ మీ కారు ఇన్సూరెన్స్ ఎక్స్‌పెయిరీ అయితే సకాలంలో దానిని రెన్యువల్ చేసుకోకపోతే.. మీరు కూడబెట్టుకున్న నో క్లెయిమ్ బోనస్ వల్ల రావాల్సిన డిస్కౌంట్ మ్మొత్తం కోల్పోతారు. లేటుగా పాలసీ రెన్యూవల్ చేస్తే తిరిగి మ్మొదటి నుంచి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

ఒకవేళ మీరు కారు కొన్నాక షోరూంలో గానీ లేదా బయట గానీ దానికి ఎలాంటి మార్పులు చేసినట్లయితే.. దాని వల్ల మీరు చెల్లించాల్సిన ఇన్సూరెన్స్ ప్రీమియం పెరుగుతుంది. ఒకవేళ పాలసీ తీసుకునే సమయంలో ఈ మార్పుల గురించి ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేకపోతే తర్వాత క్లెయిమ్ కోసం ప్రయత్నించినప్పుడు దానిని వారు పూర్తిగా నిరాకరించే ప్రమాదం ఉంటుంది.

ఒకవేళ మీరు అధిక ప్రీమియం కారణంగా పాలసీని కొనుగోలు చేయటం కష్టంగా మారితే.. మీరు ఇన్సూరెన్స్ కంపెనీతో మాట్లాడి క్లెయిమ్లో కొంత భాగాన్ని వదులుకునేందుకు ఇష్టపడితే వారు ప్రీమియం తగ్గిస్తారు.

ఒకవేళ మీ కారుపై ఏదైనా గీతలు, స్కాచెస్ పడితే దానికి సొంతంగా డబ్బు ఖర్చు చేసుకోవటం ఉత్తమం. ఒకవేళ దీనికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం వెళితే కారు యజమాని నో క్లెయిమ్ బోనస్ కోల్పోవటంతో పాటు ఇది పాలసీ ప్రీమియం 50 శాతం వరకు పెంచుతుంది.

ఇక చివరిగా చాలా మందికి అస్సలు తెలియని అతిపెద్ద కారు ఇన్సూరెన్స్ సీక్రెట్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. నగరాల్లో క్యాబ్ సర్వీసెస్ అందుబాటులోకి రావటంతో చాలా మంది తమ సొంత కార్లను వినియోగించటం తగ్గించారు. ఇలాంటి వారు ఇన్సూరెన్స్ కంపెనీ వద్ద నడిపిన కిలోమీటర్లకు మాత్రమే ఇన్సూరెన్స్ తీసుకునే సౌకర్యాన్ని ఉపయోగించుకోవటం ఉత్తమం. దీనినే పేయాజ్ యూ డ్రైవ్ ఫ్యూచర్ అని పిలుస్తారు. ఒకవేళ ముందుగా చెప్పిన కిలోమీటర్ల కంటే తక్కువ కారును నడిపితే తర్వాత సంవత్సరం ప్రీమియం చెల్లింపులో డిస్కౌంట్ కూడా పొందవచ్చు.

# 1984 అల్లర్లపై రాహుల్ గాంధీ ఏమన్నారంటే..?

- అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ కార్యక్రమంలో రాహుల్ కు సిక్కు యువకుడి ప్రశ్న
- ఈ అల్లర్ల నిందితుడు సజ్జన్ కుమార్ పై కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోలేదేమని నిలదీత
- అప్పట్లో జరిగింది తప్పేనని తాను చాలాసార్లు చెప్పానన్న రాహుల్ గాంధీ
- ఆ తప్పులు జరిగినప్పుడు తాను లేనని, అయినా బాధ్యత తీసుకుంటానని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై ఓ సిక్కు యువకుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీశారు. అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ను నేరుగా ప్రశ్నించారు. సిక్కు వ్యతిరేక అల్లర్లపై, అల్లర్ల కేసులో దోషిగా తేలిన సజ్జన్ కుమార్ వంటి నేతలపై కాంగ్రెస్ పార్టీ ఏం చర్యలు తీసుకుందని అడిగారు. సజ్జన్ కుమార్ ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నాడని గుర్తుచేశారు. భారత దేశంలో బీజేపీ ప్రభుత్వం వల్ల సిక్కులు భయపడుతూ బతకాల్సి వస్తోందని, తలపై టర్బన్ ధరించకుండా చట్టాలు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాహుల్ చెప్పిన విషయాన్ని ఆ విద్యార్థి గుర్తుచేశాడు.

తలపాగా ధరించడం, కడా వేసుకోవడం, గురుద్వారాకు వెళ్లడం మాత్రమే కాదు సిక్కులకు భావప్రకటనా స్వేచ్ఛ కావాలని అన్నాడు. కాంగ్రెస్ పాలనలో అది లభించలేదని ఆరోపించాడు. ఇప్పటికీ కాంగ్రెస్ అగ్ర నేత అయిన మీరు (రాహుల్ గాంధీ) సిక్కులతో సయోధ్య కుదుర్చుకోలేదన్నాడు. బీజేపీ పాలన గురించి మీరు భయపెడుతున్నారు కానీ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ సజ్జన్ కుమార్ లాంటి నేతలను వెనకేసుకు వస్తోందని విమర్శించాడు. పాకిస్థాన్ లోని ఆనంద్ పూర్ సాహిబ్ ను సిక్కులు దర్శించుకునే వీలు కల్పించేందుకు బీజేపీ సర్కారు ఓ తీర్మానం చేయగా.. కాంగ్రెస్ పార్టీ దానిని వేర్పాటువాద పత్రంగా అభివర్ణించిందని గుర్తుచేశాడు. కాంగ్రెస్ పార్టీ తీరు ఇలాగే ఉంటే బీజేపీ పంజాబ్ లోకి కూడా ప్రవేశిస్తుందని ఆ యువకుడు తేల్చిచెప్పారు.

సిక్కు యువకుడి ప్రశ్నలకు రాహుల్ గాంధీ జవాబిస్తూ.. 1980లలో భారత్ లో జరిగింది తప్పేనని తాను చాలాసార్లు బహిరంగంగానే చెప్పానని వివరించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చాలా తప్పులు చేసిందని అంగీకరిస్తూనే ఆ సమయాలలో తాను లేననే విషయం గుర్తుచేశారు. అయినప్పటికీ, కాంగ్రెస్ చరిత్రలో చేసిన ప్రతి తప్పుకు తాను బాధ్యత వహించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అమృత్ సర్ లోని స్వర్ణ దేవాలయాన్ని చాలాసార్లు సందర్శించానని రాహుల్ తెలిపారు. అదేవిధంగా సిక్కులతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, బ్రౌన్ యూనివర్సిటీలో జరిగిన ఈ ప్రశ్నోత్తరాలపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నవ్వులపాలవుతున్నారని వ్యాఖ్యానించారు.

# పాక్ మహిళను పెళ్లి చేసుకుని... ఇప్పుడు మోదీయే న్యాయం చేయాలంటున్న జవాన్!

- పాకిస్థానీ మహిళను పెళ్లాడిన సీఆర్పీఎఫ్ జవాన్ మునీర్ అహ్మద్
- వివాహ సమాచారం దాచారంటూ ఉద్యోగం నుంచి తొలగించిన అధికారులు
- అధికారులకు ముందే చెప్పానని, ఆధారాలున్నాయని మునీర్ వాదన
- తన ఉద్వాసన అన్యాయమని, ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:**పాకిస్థానీ మహిళను వివాహం చేసుకున్న విషయాన్ని గోప్యంగా ఉంచాడన్న ఆరోపణలపై మునీర్ అహ్మద్ అనే సీఆర్పీఎఫ్ జవాన్‌ను విధుల నుంచి తొలగించడం తెలిసిందే. అయితే, తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, అధికారులకు ముందే సమాచారం ఇచ్చానని ఉద్వాసనకు గురైన జవాన్ మునీర్ అహ్మద్ వాదిస్తున్నాడు. తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. సీఆర్పీఎఫ్ 41వ బెటాలియన్‌లో పనిచేస్తున్న మునీర్ అహ్మద్, గత ఏడాది మే నెలలో పాకిస్థాన్‌కు చెందిన మెనల్ ఖాన్‌ను వీడియో కాల్ ద్వారా వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమె వీసాపై భారత్‌కు వచ్చింది అయితే, ఈ వివాహ విషయాన్ని మునీర్ తమ దృష్టికి తీసుకురాలేదని, పైగా ఆమె వీసా గడువు ముగిసినప్పటికీ ఇక్కడే ఉంచుకున్నారని సీఆర్పీఎఫ్ అధికారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, పాక్ జాతీయులు స్వదేశానికి వెళ్లాలని భారత్ సూచించిన తరుణంలో ఈ విషయం బయటపడింది. అయితే, అధికారుల ఆరోపణలను మునీర్ అహ్మద్ ఖండించాడు. తాను పాక్ మహిళను పెళ్లి చేసుకోబోతున్న విషయం అధికారులకు ముందే చెప్పానని, దీనికి సంబంధించిన ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయని జాతీయ మీడియాతో మాట్లాడుతూ వెల్లడించాడు. “2024లో మెనల్ ఖాన్‌ను పెళ్లి చేసుకున్నాను. ఆమెతో ప్రేమ వ్యవహారం గురించి 2022 నుంచే అధికారులకు తెలియజేస్తున్నాను. ఇందులో దాచిపెట్టడానికి ఏముంది? నన్ను ఉద్యోగం నుంచి తొలగించారని తెలియగానే షాక్‌కు గురయ్యాను. నా తప్పేమీ లేకుండా, కావాలనే నన్ను తొలగించారు” అని మునీర్ వాపోయాడు.

“ఒక జవానుగా నాకు న్యాయం జరగాలి. ఈ అన్యాయంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయమని కోరతాను” అని మునీర్ అహ్మద్ పేర్కొన్నాడు.

# తిరుమల క్యూ లైన్‌లో అపశ్రుతి.. ఒకరినొకరు కొట్టుకున్న భక్తులు.. అసలేం జరిగిందంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల శ్రీవారి ఆలయం ముందు క్యూ లైన్‌లో భక్తుల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ కారణంగా భక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. శనివారం సాయంత్రం క్యూలైన్‌లో చిన్న పిల్లలతో వస్తున్న మహిళలను తోటి భక్తులు తోసి వేశారని భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భక్తులు ఒకరిపై ఒకరు దాడికి దిగారు. అక్కడే ఉన్న విజిలెన్స్, పోలీస్ సిబ్బంది వారిని అదుపు చేసేందుకు ఎంత ప్రయత్నించినా భక్తులు ఒకరికి ఒకరు కొట్టుకోవడం జరిగింది. వెంటనే క్యూలైన్ వద్దకి విజిలెన్స్ అధికారులు చేరుకొని భక్తులను పక్కకు తీసుకెళ్లారు. ఆదివారం కావడం, పిల్లలకు వేసవి సెలవులు ఇవ్వడంతో తిరుమలలో శ్రీవారి దర్శనానికి గంటల కొద్దీ సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్?లో 31 కంపార్ట్?మెంట్లలో భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలో ఉన్నారు.

ఉచిత దర్శనం క్యూ లైన్?లోకి ఉదయం ఏడున్నర గంటలకు టోకెన్ లేకుండా ప్రవేశించిన భక్తులకు దర్శనానికి సుమారు 15 గంటల సమయం పడుతోంది. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు కూడా ఐదు గంటలకు పైగానే దర్శనానికి నిరీక్షిస్తున్నారు. 3 వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని భక్తులు గమనించాలని అధికారులు చెబుతున్నారు.

వేసవి సెలవులు కావడంతో తిరుమలకు భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని శనివారం ఒక్కరోజే 84వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం శనివారం ఒక్కరోజే రూ.4 కోట్ల 12 లక్షల రూపాయలు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

## ప్రయాణికులకు షాకిచ్చిన ఇండియన్ రైల్వే.. ఇకపై అలా జర్నీ కుదరదు..




**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ రైల్వే సంస్థ పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తుంది. దేశవ్యాప్తంగా విస్తృత కనెక్టివిటీ కలిగి ఉండటంతో సామాన్య భారతీయ ప్రజలకు అత్యంత ఇష్టమైన ప్రయాణ ఎంపికగా నిలిచింది. అయితే తాజాగా ఈ సంస్థ మే 1, 2025 నుంచి తన నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. కొత్తగా ప్రకటించిన రైల్వే టిక్కెట్ బుక్కింగ్ విధానం కింద వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న టిక్కెట్ హోల్డర్లపై ప్రభావం పడనుంది. దీని ప్రకారం కన్ఫమ్ కాకుండా.. వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లు ఉన్న ప్రయాణీకులు ఇకపై స్లీపర్, ఏసీ కోచ్‌లలో ప్రయాణించటం కుదరదని స్పష్టం చేసింది. అంటే దీనిప్రకారం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న టిక్కెట్లను కలిగి ఉన్న ప్రయాణీకులు ఇకపై జనరల్ బోగీల్లో మాత్రమే ప్రయాణించేందుకు వీలు ఉంటుంది. మారిన రూల్స్ ప్రకారం ఇకపై వారు ఏసీ లేదా స్లీపర్ కంపార్ట్మెంట్లలో ప్రయాణించలేరు.

కొత్త నిబంధనలను పాటించని వ్యక్తులపై జరిమానా విధించబడుతుందని వెల్లడైంది. వెయిటింగ్ లిస్ట్ టికెట్‌తో బోర్డింగ్ స్లీపర్ కోచ్‌లోకి ఎక్కితే వారిపై రూ.250 జరిమానా విధించబడుతుంది. ఇక ఏసీ బోగీ ఎక్కుతూ చిక్కితే మాత్రం రూ.440 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. అలాగే వీటికి అదనంగా నిబంధనలను ఉల్లంఘించే ప్రయాణికుల నుండి వారు ఎక్కిన తదుపరి రైలు స్టేషన్ నుంచి ఛార్జీని రైల్వే టీసీలు వసూలు చేయవచ్చు.దీనికి ముందు కొన్ని వారాల కిందట రైల్వే టిక్కెట్ల ముందస్తు రిజర్వేషన్ గడువు విషయంలో కూడా కీలక మార్పులు ప్రకటించబడ్డాయి. గతంలో 120 రోజలకు ముందే ప్రయాణ టిక్కెట్లను రిజర్వేషన్ కింద బుక్ చేసుకునే వెసులుబాటును ప్రస్తుతం కేవలం 60 రోజులకు తగ్గించారు. ప్రస్తుతం స్లీపర్ లేదా ఏసీ బోగీల్లో పెరుగుతున్న అనవసరపు రద్దీని తగ్గించేందుకు రైల్వేశాఖ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టిందని తెలుస్తోంది.

## అంబానీ సరికొత్త యుద్ధం.. నెలకి రూ.81కే అన్‌లిమిటెడ్ కాల్స్ ప్లాన్




**హైదరాబాద్ పెన్ పవర్:**గడచిన కొన్ని నెలలుగా ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కొత్త కస్టమర్లను ఆకర్షించటంలో కొంత వెనకబడింది. దీనికి కారణం అనంత్ అంబానీ పెళ్లి తర్వాత పెంచిన టారిఫ్స్. ఈ కాలంలో చాలా మంది బీఎస్ఎన్ఎల్ కి మారిపోయారు. అయితే ప్రస్తుతం జియో దాదాపు 46 కోట్ల మంది మొబైల్ యూజర్లను కలిగి ఉంది. ఈ క్రమంలోనే తన యూజర్ బేస్ పెంచుకునేందుకు అంబానీ సరికొత్త ప్లాన్ ప్రకటించి టెలికాం రంగంలో పెద్ద ప్రకంపనలు సృష్టిస్తున్నారు. రిలయన్స్ జియో ఇప్పటి వరకు ఇంటర్నెట్ ఎక్కువగా వినియోగించే యూజర్లను టార్గెట్ చేస్తూ అనేక రీఛార్జ్ ప్లాన్లను డిజైన్ చేసిన సంగతి తెలిసింది. అయితే తాజాగా బేసిక్ మొబైల్ యూజర్లకు అందుబాటులో కూడా 11 నెలల కాలానికి రూ.వెయ్యి కంటే తక్కువ ఖర్చులో కొత్త రీఛార్జ్ ప్లాన్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎక్కువ కాలం వ్యాలిడిటీ ప్లాన్లకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా కంపెనీ దీనిని తీసుకొచ్చిందని తెలుస్తోంది.

# పాక్‌కు చుక్కలు చూపిస్తున్న భారత్..
# బాగ్‌లిహార్ డ్యామ్ నీళ్లు బంద్

**హైదరాబాద్ పెన్ పవర్:**పహల్గామ్‌లో టెర్రరిస్టులు దాడి చేసిన తర్వాత పాకిస్తాన్‌ను అన్ని వైపుల నుంచి భారత్ గట్టిగా బిగిస్తోంది. ఇదివరకే సింధు నదుల ఒప్పందానికి బ్రేక్ వేసిన ఢిల్లీ పెద్దలు, తాజాగా బాగ్‌లిహార్ డ్యామ్ నుంచి పాక్‌కు పోయే నీళ్లను కూడా ఆపేశారు. దాయాది దేశాన్ని ఇబ్బంది పెట్టే పనుల్లో ఇది రెండోదని అనుకుంటున్నారు. పాకిస్తాన్ శనివారం నేల మీద నుంచి నేల మీదకు పేల్చే రాకెట్‌ను టెస్ట్ చేసిన టైమ్‌లోనే ఈ విషయం బయటికి రావడం విశేషం.నీళ్ల ప్రవాహం ఆగడానికి ఆ డ్యామ్ గేట్లను పూర్తిగా కిందకు దించేశారు. దీంతో పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రానికి ఇక్కడి నుంచి నీళ్ల సరఫరా బంద్ అయింది. ఇది కొద్ది రోజులే ఉంటుందని అక్కడి పెద్దాయన ఒకరు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు చెప్పారు. అవసరమైతే భారత్ గట్టి చర్యలు తీసుకుంటదని పాక్‌కు అర్థమయ్యేలా చెప్పినట్టేనని ఆయన అన్నారు.

900 మెగావాట్ల కరెంటు కోసం ఈ డ్యామ్‌ను చీనాబ్ నది మీద 2008లో కట్టారు. ఈ డ్యామ్ దాదాపు 145 మీటర్ల పొడవు ఉంటది. సింధు నదుల ఒప్పందం ప్రకారం పాక్‌కు ఎక్కువ నీళ్లు వచ్చే నదుల్లో చీనాబ్ కూడా ఒకటి. పంజాబ్ రాష్ట్రంలో చాలా పంటలు దీని మీదే ఆధారపడి ఉంటాయి. టెర్రరిస్టులు దాడి చేసిన తర్వాత



ఏప్రిల్ 26న సింధు నదుల ఒప్పందాన్ని భారత్ ఆపేసింది. ఆ తర్వాత 29కే ఈ డ్యామ్ నుంచి పాకిస్తాన్‌కు పోయే నీళ్లు ఆగిపోయాయని శాటిలైట్ ఫొటోలు బయటపెట్టాయి. పాక్‌లోని సియాల్‌కోట్ దగ్గరికి వచ్చేసరికి చీనాబ్ నది మొత్తం ఎండిపోయింది. పాక్‌లోని పంజాబ్‌లో పత్తి, వరి పండించడానికి ఈ నీళ్లు చాలా ముఖ్యం.ఇక గత వారం జీలం నది వరద పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భయపెట్టింది. అక్కడి ముజఫరాబాద్ దగ్గర పోయిన వారం జీలం నదిలో నీళ్ల మట్టం ఒక్కసారిగా చాలా అడుగులు పెరిగిపోయింది. దీంతో అక్కడి అధికారులు హట్టియాన్ బాలా అనే ఏరియాలో ఎమర్జెన్సీ పెట్టాల్సి వచ్చింది. ముజఫరాబాద్‌కు ఇది 40 కిలోమీటర్ల దూరం ఉంటది. ప్రజలను నది దగ్గరికి రావొద్దని మసీదుల నుంచి అనౌన్స్ చేశారు. ఈ నది అనంతనాగ్ జిల్లా మీదుగా పోయి చకోథి ఏరియాలో పీవోకేలోకి వెళ్తుంది.

# పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఏం జరిగింది మోదీతో ఒమర్ అబ్దుల్లా భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:**పహల్గాం మారణకాండ తర్వాత జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం ప్రధాని నరేంద్ర మోడీని కలవడం దేశ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రధాని నివాసంలో దాదాపు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత పరిణామాలపై ఇరువురు నేతలు క్షుణ్ణంగా చర్చించారు. ఉగ్రవాదుల దుశ్చర్యలు, వాటిని ఎదుర్కోవడానికి తీసుకుంటున్న భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతోందనే వార్తలు వస్తున్న తరుణంలో ప్రధాని మోడీతో ఒమర్ అబ్దుల్లా భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. జమ్మూ కాశ్మీర్‌లోని తాజా పరిస్థితులను, క్షేత్రస్థాయి వాస్తవాలను సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రధాని మోడీకి వివరించారు.

పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్‌లో వెల్లువెత్తిన ప్రజా నిరసనల గురించి ప్రధాని మోడీకి ఒమర్ అబ్దుల్లా తెలియజేశారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పోనీవాలా సయ్యద్ అదిల్ హుస్సేన్ షా ధైర్యసాహసాలను ప్రధానికి వివరించారు. పర్యాటకులను రక్షించడానికి ఆయన చేసిన ప్రయత్నాలను కొనియాడారు.పహల్గాం దాడిలో పర్యాటకులను కాపాడలేకపోయినందుకు జమ్మూ



కాశ్మీర్ అసెంబ్లీలో ఒమర్ అబ్దుల్లా ఇదివరకే విచారం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సమయంలో రాష్ట్ర హోదా గురించి కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులను నివారించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి తర్వాత భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సరిహద్దు ప్రాంతాలతో పాటు జమ్మూ కాశ్మీర్ అంతటా ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఉగ్రవాదులకు సహకరించిన వారిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఉగ్రవాదులు పక్కా ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఏప్రిల్ 15న పహల్గాం చేరుకున్న ఉగ్రవా దులు బైసరన్ లోయలో దాడికి వ్యూహరచన చేశారు. ఉగ్రవాదులకు స్థానికులు సహకరించారని జాతీయ దర్యాప్తు సంస్థ గుర్తించింది. పహల్గాం దాడికి పాకిస్థానే సూత్రధారి అని తేలడంతో భారత్ ఆ దేశానికి ఎగుమతులు, దిగుమతులు రద్దు చేసింది.

## రోజా కబ్జా చేశారు.. టీడీపీ ఆఫీసుకు ఫిర్యాదు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏదైనా సమస్య ఎదురైతే ఎవరైనా ఏం చేస్తారు? సంబంధిత ప్రభుత్వ ఆఫీసులకు వెళతాడు. ఏదైనా తప్పుడు పనులు చేస్తే పోలీసుల్ని ఆశ్రయిస్తారు. ఎక్కడైనా ఇలానే జరుగుతుంది. కానీ.. ఇలాంటి ఇష్యూలను సరికొత్తగా డీల్ చేసే టాలెంట్ ఏపీ ప్రజల్లో కనిపిస్తూ ఉంటుంది. తాజాగా అలాంటి సీన్ ఒకటి వెలుగు చూసింది. ఏపీ మాజీ మంత్రి.. వైసీపీ సీనియర్ నేత.. ఫైర్ బ్రాండ్ గా పేరున్న సినీ నటి ఆర్కే రోజాపై భూకబ్జా ఆరోపణలు ఫిర్యాదు రూపంలో తెర మీదకు వచ్చాయి. అయితే.. ఈ భూకబ్జాకు సంబంధించిన కంప్లైంట్ పోలీసులకో.. రెవెన్యూ అధికారులకో కాకుండా.. ఏపీ అధికార పార్టీ తెలుగుదేశం హెడ్డాఫీసులో చేయటం విశేషం. చిత్తూరు జిల్లా విజజయపురం మండలం కలింబాకకు చెందిన టీఎన్ టీయూసీ నేత గుణశేఖర రెడ్డి కొత్త ట్రెండ్ కు తెర తీశారు. తాజాగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన.. తన ఫిర్యాదునుఅక్కడి వారికి ఇచ్చారు. ఆయన వాదన ఏమంటే.. తన తండ్రి నగరికొండ సమీపంలోని జ్యోతినగర్ లో 1982లో స్థలాన్ని కొన్నారని.. దాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా.. ఆమె భర్త సెల్వమణి.. నగరి పురపాలక సంఘం ఛైర్మన్ లతో కలిసి మీనాకుమార్ అనే వ్యక్తి కబ్జా పెట్టినట్లుగా ఆరోపించారు. తన స్థలంలో రేకుల షెడ్ వేశారని.. పోలీసులు సైతం స్పందించటం లేదని.. వీరంతా కలిసి పోలీసులని ప్రలోభాలకు గురి చేసినట్లుగా ఆరోపించారు. ఇటీవల కాలంలో వివిధ సమస్యలతో పార్టీ హెడ్డాఫీసుకు వచ్చే వారి నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న నేపథ్యంలో.. తాజా ఫిర్యాదు తెర మీదకు వచ్చింది. మరి.. మాజీ మంత్రి ఆర్కే రోజాపై వచ్చిన కంప్లైంట్ కు ఏ తరహా చర్యలు ఉంటాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రెండు రాష్ట్రాలకు హై అలెర్ట్... మూడు రోజులు భారీ వర్షాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. మరో వైపు ఎండలు కూడా ఠారెత్తిస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ద్రోణి ప్రభావంతోనే భారీ వర్షాలు పడతాయని వాతావరణ శఆఖ తెలిపింది. ఉత్తర – దక్షిణ ద్రోణి తమిళనాడు వరకూ విస్తరించి ఉందని పేర్కొంది. సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రబావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడతాయని అలెర్ట్ గా ఉండాలని సూచించింది. అదే సమయంలో ఈదురుగాలులు బలంగా వీస్తాయని, గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా తెలిపింది.

## భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ ప్రధానిని కలిసిన ఎయిర్ చీఫ్.. అసలేం ఏం జరుగుతోంది?



హైదరాబాద్ పెన్ పవర్:భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఉన్నత స్థాయి సమావేశాలు జరుగుతున్నాయి. తాజాగా, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛ లభించిన నేపథ్యంలో, ఈ సమావేశంలో ఎలాంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయో తెలుసుకోవాలని చాలా మంది ఆసక్తిగా ఉన్నారు. అంతకుముందు నౌకాదళాధిపతి కూడా ప్రధానిని కలవడం దేశ రక్షణ రంగంలో జరుగుతున్న సన్నద్ధతను సూచిస్తోంది.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సమావేశమయ్యారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ భేటీ జరిగింది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఈ సమావేశం జరగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అంతకు ముందు రోజే, నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడానికి త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. లక్ష్యాలు, దాడి సమయం వంటి విషయాలను వారే నిర్ణయించుకోవచ్చని సీసీఎస్ స్పష్టం చేసింది. ఇక శుక్రవారం సన్నద్ధతలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారత వాయుసేన యుద్ధ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ విన్యాసాలు నిర్వహించడం జరిగింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత వాయుసేన పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి దాడి చేసింది. ఆ సమయంతో పోలిస్తే ఇప్పుడు రఫేల్ యుద్ధ విమానాలు, ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో భారత వాయుసేన శక్తి గణనీయంగా పెరిగింది. భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎయిర్ చీఫ్ మార్షల్, ప్రధాని మోదీల భేటీ అనేక ఊహాగానాలకు దారితీస్తోంది. ఈ సమావేశంలో దేశ రక్షణకు సంబంధించిన కీలకమైన వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చలు జరిగాయని భావిస్తున్నారు. వాయుసేన ప్రస్తుత సన్నద్ధత, సరిహద్దుల్లో నిఘా, అవసరమైతే చేపట్టవలసిన చర్యలపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది.

## హౌతీ మిస్సైల్ దాడి... టెల్ అవీవ్ కు విమానాలు నిలిపివేసిన ఎయిరిండియా

హైదరాబాద్ పెన్ పవర్:ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీ తిరుగుబాటుదారులు క్షిపణి దాడి జరపడంతో ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. టెల్ అవీవ్‌కు నడిచే తమ విమాన సర్వీసులను తక్షణమే రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసింది.విమానాశ్రయంపై దాడి జరిగిన సమయంలో, ఢిల్లీ నుంచి టెల్ అవీవ్ బయలుదేరిన ఎయిరిండియా విమానం %ూ×%139ను అబుదాబికి మళ్లించినట్లు సంస్థ తెలిపింది. విమానం అబుదాబిలో సురక్షితంగా ల్యాండ్ అయిందని, త్వరలోనే తిరిగి ఢిల్లీకి చేరుకుంటుందని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో, మే 6 వరకు టెల్ అవీవ్‌కు రాకపోకలు సాగించే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఎయిరిండియా ఒక ప్రకటనలో వివరించింది.

## స్వామి శివానంద 128 ఏళ్లు జీవించడానికి కారణాలు తెలుసా?




హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ యోగా గురువు, స్వామి శివానంద మరణించారు. ఆయన వయసు 128 ఏళ్లు. వారణాసిలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 128 ఏళ్ల పాటు ఆయన జీవించడానికి కారణం యోగాతో పాటు ఆయన జీవన విధానం.. తీసుకునే ఆహారం మాత్రమే. శివానంద 128 ఏళ్లు బతకడానికి ఎలాంటి ఆహార నియమాలు పాటించారన్నది ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా సెర్చ్ చేస్తున్నారు. ఆయన యోగా గురువు. స్వామి శివానందకు భారతప్రభుత్వం పద్మశ్రీ అవార్డును కూడా అందచేసింది.

**కాయగూరలతో పాటు...**

రాత్రి తొమ్మిది గంటలకల్లా నిద్ర పోవడం, తెల్లవారు జామున మూడు గంటలకు నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని తర్వాత యోగా చేస్తారు. కాశీ ఘాట్లలో యోగా సాధనతో పాటు బోధన కూడా చేస్తారు. ఇక కాయగూరలు ఆహారంగా స్వీకరిస్తారు. పండ్లు, ఉడికించిన కూరగాయాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. 1986 ఆగస్టులో ఆయన అవిభాజ్య భారత్ లోని సిల్హెట్ లో జన్మించారు. ఈ ప్రాంతం ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఉంది. నిరుపేద కుటుంబంలో జన్మించిన స్వామి శివానంద చిన్న నాటి నుంచి ఆధ్యాత్మికత వైపు అడుగులు వేశారు.

**ఆశ్రమంలో పెరిగి...**

ఆరేళ్ల వయసులో తల్లిదండ్రులు చనిపోవడంతో ఆయన పశ్చిమ బెంగాల్ లోని ఒక ఆశ్రమంలో పెరిగారు. ఆయన అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా కుష్టురోగులకు సేవ చేసి అందరి ప్రశంసలను అందుకున్నారు. ఇటీవల జరిగిన ప్రయాగరాజ్ కుంభమేళాకు కూడా స్వామి శివనందవచ్చారు. అక్కడే ఉండి పుణ్యస్నానాలు ఆచరించేవారు. శివానందను చూసేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తన పని తాను చేసుకునే స్వామి శివానంద ప్రతి కుంభమేళాకు హాజరవుతూ వచ్చారు.

**ధ్యానంతో పాటు.. ఆహారం...**

ఉదయం ధ్యానం నుంచి ఆయన కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. స్వామి కేవలం నూనె, ఉప్పులేని ఉడికించిన ఆహారం మాత్రమే తీసుకుంటారు. పాలపదార్థాలకు దూరంగా ఉంటారు. రాత్రి తొమ్మిదింటికి నిద్రపోయి ఉదయం మూడు గంటలకు నిద్రలేచేస్తారు. యోగా చేస్తారు. స్వామీజీ 128 ఏళ్లు బతకడంతో పాటు తన పనులు తానే చేసుకోవడం చూసి ఆయనను దైవ స్వరూపుడిగా భావించి ఆయన దర్శనం చేసుకోవడానికి భక్తులు ప్రయాగరాజ్ లో క్యూ కట్టారు స్వామి శివానంద మృతిపట్ల ప్రధాని మోదీ సంతాపాన్ని ప్రకటించారు.

## అబ్బాయికి మంచి రోజులు వచ్చినట్టేనా ?



హైదరాబాద్ పెన్ పవర్:విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు డీసీసీబీ చైర్మన్ పదవిని టీడీపీ అధినాయకత్వం అప్పగించింది. ఈ పదవి జిల్లా స్థాయిలో పెద్దదే అన్నది వాస్తవం.

వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ డీసీసీబీ చైర్మన్ గా తొలి నాళ్ళలో పనిచేసి రాజకీయంగా పట్టు సాధించారు అలాగే మరో సీనియర్ వైసీపీ నేత కోలగట్ల వీరభద్రస్వామి కూడా డీసీసీబీ చైర్మన్ పదవిలో పనిచేసారు.

ఇక యువకుడు విద్యాధికుడు అయిన కిమిడి నాగార్జునకు ఈ పదవిని కట్టబెట్టడం ద్వారా జిల్లా రాజకీయాల్లో మరింత పట్టు సాధించేందుకు పసుపు పార్టీ అవకాశం ఇచ్చింది. ఇక నాగార్జునది రాజకీయ కుటుంబం. ఆయన తండ్రి కిమిడి గణపతిరావు ఎమ్మెల్యేగా గతంలో పనిచేసారు. ఇక తల్లి కిమిడి మృణాళిని 2014 నుంచి 2017 దాకా మంత్రిగా చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేశారు.

మరో వైపు చూస్తే కనుక కిమిడి కళా వెంకట్రావు స్వయంగా నాగార్జునకు పెద్ద నాన్న అవుతారు. ఆయన నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన రాజకీయ దిగ్గజ నేతగా ఉన్నారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా చాలా కాలం పనిచేశారు. ఇక 2024లో ఆయన ఎచ్చెర్ల టికెట్ కోరుకుంటే పొత్తులో దానికి బీజేపీకి ఇచ్చిన టీడీపీ అధినాయకత్వం కళా వెంకట్రావు విజయనగరం జిల్లా చీపురుపల్లికి పంపించి పోటీ చేయించింది.

మరో వైపు చూస్తే ఆయన మంత్రి పదవి మీద ఆశలు పెట్టుకున్నా జూనియర్ అయిన కొండపల్లి శ్రీనివాస్ కి ఆ పదవిని ఇచ్చారు. దాంతో కళా వెంకట్రావు జస్ట్ ఎమ్మెల్యేగా మిగిలిపోయారు ఇక టీడీపీలో సీనియర్లకు రాజకీయంగా విరామం ప్రకటిస్తున్న నేపథ్యం ఉంది. దాంతో 2029 ఎన్నికల్లో కిమిడి నాగార్జునకు చీపురుపల్లి ఎమ్మెల్యే సీటు గ్యారంటీగా దక్కుతుందని అంటున్నారు.

ఈ నాలుగేళ్ల గ్యాప్ లో ఆయన డీసీసీబీ చైర్మన్ గా ఉంటూ తన రాజకీయ పట్టుని పెంచుకునే విధంగా అవకాశం కల్పించారు అని అంటున్నారు అయితే ఎమ్మెల్సీ పదవి తమ నేతకు దక్కుతుందని నాగార్జున అనుచరులు అభిమానులూ భావించారు కానీ ఈ పదవిని ఇచ్చారని కొంత నిరాశ చెందుతున్నారు.

అయినా ఈ పదవి కూడా కీలకం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతానికి అనుసంధానం అయినందువల్ల నాగార్జున రేపటి రాజకీయ జీవితాన్ని బలోపేతం చేస్తుందని అంటున్నారు. కిమిడి నాగార్జున విజయనగరం జిల్లా టీడీపీలో ఎదుగుతున్న నాయకుడు. దాంతో ఆయనకు ఊతమిచ్చేలాగానే హైకమాండ్ ఈ పదవి అప్పగించింది అని అంటున్నారు.

వచ్చే ఎన్నికల్లో పెద నాన్నకు చెక్ పెట్టి అబ్బాయిని ముందుకు తెచ్చే ముందస్తు వ్యూహంలో భాగమే ఇదంతా అని అంటున్నారు. చూడాలి మరి ఈ కొత్త పదవిలో నాగార్జున రాజకీయ దూకుడు ఎలా సాగుతుందో.

# సీతానవమి : పెళ్లికి ఆటంకాలు వస్తున్నాయా.. మే 5 వ తేదీ ఈ మంత్రాన్ని పఠించండి..

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రతి సంవత్సరం వైశాఖ మాసం శుక్లపక్షంలో వచ్చే నవమి తిథిని సీతా నవమిగా జరుపుకుంటారు. ఆ రోజే సీతమ్మ జన్మించిందని భావిస్తారు. ఈ ఏడాది సీతానవమి మే 5 వ తేది సోమవారం వచ్చింది. దీనినే జానకి నవమి అనికూడా అంటారు. శ్రీరామనవమికి శ్రీరాముడి జన్మ కథ చెప్పినట్టుగానే జానకీ నవమి రోజు కూడా సీతమ్మ జన్మదిన కథ గురించి వివరిస్తారు.

సీతారాధనకు కూడా ఒక ప్రత్యేకమైన రోజు ఉంది. హిందూ క్యాలెండర్‌లో అత్యంత పవిత్రమైన పండుగలలో జానకి జయంతి ఒకటి. వివాహానికి ఆటంకాలు ఎదురవుతున్న యువతీ, యువకులు సీతా నవమి ( మే 5) రోజున సీతామాతను, శ్రీరాముడిని కలిసి పూజిస్తే త్వరలో వివాహం జరుగుతుందని చెబుతారు. ఈ పూజతో పాటు, వివాహితుల వైవాహిక జీవితం ఆనందంగా మారుతుంది, వారు ఆనందం, శాంతి, శ్రేయస్సు పొందుతారు.

వివాహానికి అడ్డంకులు ఎదురవుతున్న వారు కూడా సీతాజయంతి రోజున సీతారాములను ఆరాధించి... ఉపవాసం చేస్తే తప్పకుండా అడ్డంకులన్నీ తొలగిపోయి వివాహం జరుగుతుందని చెబుతారు. శ్రీ జానకి రామాభ్యామ్ నమః అనే మంత్రాన్ని 108 సార్లు



జపించాలి. ఆ తరువాత సీతా నవమి కథను భక్తి శ్రద్దలతో చదువుకోవాలి. సాయంత్రం వరకు ఉపవాసం చెయ్యాలి. సాయంత్రం జానకీ మాతకు దీపం వెలిగించి పూజ అనంతరం సీతారాములకు పాలు బెల్లంతో చేసిన వంటలను నివేదించిన తర్వాత ఉపవాసం విరమించాలి.

ఈ పూజను దంపతులిద్దరూ కలిసి జరుపుకోవడం వల్ల వారి మధ్య అనురాగం పెరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ పండుగను ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో ఎక్కువగా జరుపుకుంటారు. సీతా జయంతిని భక్తిగా జరుపుకునే వారికి ఆనందదాయకమైన దాంపత్య జీవితం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. జానకి జయంతి రోజున సీతమ్మను కొలిచేవారు సంతోషకరమైన వైవాహిక జీవితాన్ని గడుపుతారని భక్తులు నమ్ముతారు. ఈ పర్వదినం రోజున ఉపవాసం ఉంటే దంపతులు వారి వైవాహిక జీవితం నుంచి అన్ని కష్టాలను తొలగుతాయని, సీతా దేవత వారికి సంతోషకరమైన జీవితాన్ని ప్రసాదిస్తుందని .. పెళ్లికాని వారికి మంచి వివాహ సంబంధం కుదురుతుందని నమ్ముతారు.

**సీతా నవమి కథ**

శ్రీరాముడు యజ్ఞ ఫలంగా జన్మించిన విధంగానే ..ఆయన భార్య సీతాదేవి పుట్టుకకు కూడా కారణాలున్నాయని పురాణాత ద్వారా తెలుస్తుంది. సీతాదేవి పుట్టక ముందు మిథిలా నగరం ప్రజలు అనేక కష్టాలను .. ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కరువు కాటకాలతో మిథిలా నగర ప్రజలు అల్లాడిపోయారు.. ఇలా ఉండగా.. మిథిలానగరం రాజు జనకమహారాజుకు ఓ రుషిపుంగవుడు.. యజ్ఞం చేస్తే కరువు.. కాటకాల నుంచి బయటపడతారని చెప్పి అదృశ్యమయ్యాడు.

ఆ రుషి ఆదేశాల మేరకు యజ్ఞం చేయడానికి భూమిని శుభ్రం చేసేందుకు దున్నుతుండగా..నాగలి చాలుకు ఓ పెట్టె దొరికింది. ఆ పెట్టెలో అందమైన ఆడశిశువు ఉంది. ఆమె సీతాదేవి. అందుకే సీతాదేవిని అయోనిజ అంటారు. అంటే తల్లి గర్భంనుంచి జన్మించలేదు అని అర్థం. ఇక ఆ చిన్నారి రాకతో మిథిలా నగరం సస్యశ్యామలం అయింది. ప్రజల ఇబ్బందులు .. సమస్యలు పరిష్కారమయ్యాయి. మిథిలా నగరంలో ప్రకృతి పులకరించిపోయింది. అప్పటివరకూ కరవుతో అల్లాడిన ఆ ప్రాంతంలో భారీ వర్షం కురుసింది. అప్పటి నుంచీ కరవు అనే మాట మిథిలానగరంలో వినిపించలేదు. అప్పటినుంచి మిథిలానగర ప్రజలు సంతోషంగా గడిపారని పండితులు చెబుతున్నారు. చాలా దేవాలయాల్లో ఈ కథను సీతానవమి రోజున చెబుతారు పండితులు.

# ఉదయం ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త..డయాబెటిస్ కావొచ్చు




**హైదరాబాద్ పెన్ పవర్:**డయాబెటిస్..ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని వేధిస్తున్న సమస్య. డయాబెటిస్ మన ఆరోగ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. అనేక రకాల దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తుంది. హృదయ సంబంధ వ్యాధులు, నరాల దెబ్బతినడం, మూత్రపిండాల దెబ్బతినడం, కంటి చూపు దెబ్బతినడం ,పాదాల సమస్యలు ఇలా రకరకాల ఆనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.రక్తంలో చక్కెర నియంత్రణ సరిగా లేకపోవడం వల్ల ఈ సమస్యలు మరింత తీవ్రమవుతాయి.

కాబట్టి డయాబెటిస్ రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. డయాబెటిస్ లక్షణాలు తెలుసుకోవడం ద్వారా ముందుగానే నియంత్రించే అవకాశం ఉంటుంది. డయాబెటిస్ అటాక్ అవుతుందంటే..

ఉదయం సమయాల్లో ఈ ఐదు లక్షణాలు కనిపిస్తాయని డాక్టర్లు అంటున్నారు. అవేంటే చూద్దాం..

1 నిద్ర లేవగానే చాలామందికి అలస, బలహీనంగా అనిపిస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే డయాబెటిక్ ఉండవచ్చు.. వెంటనే చెకప్ చేయించుకోవాలి.

2. ఉదయం లేవగానే లేదా ఉదయం వేళల్లో దృష్టి లోపాలు కూడా డయాబెటిస్ ను సూచిస్తాయి. కంటిచూపు మసకగా ఉన్నట్లయితే జాగ్రత్త పడాలి. రక్తంలో అధిక చక్కెరల కారణంగా దృష్టి తీవ్రంగా ప్రభావితం అవుతుంది.

3. డయాబెటిస్ ఉన్నట్లయితే ఉదయం నిద్ర లేచిన తర్వాత మూత్రం ముదురు పసుపు రంగులో ఉండటం లేదా తరచుగా మూత్ర విసర్జన చేయడం వంటి రక్తంలో చక్కెర స్థాయిల లక్షణాలు కనిపిస్తాయి.

4.ఉదయాన్నే అధిక దాహం వేయడం కూడా డయాబెటిస్ కు సంకేతం. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

ఐక్యరాజ్యసమితి మధుమేహాన్ని(డయాబెటిస్) ప్రపంచ ఆరోగ్య సంక్షోభంగా గుర్తించింది.డయాబెటిస్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆరోగ్యకరమైన జీవనశైలి, చికిత్స మెరుగుపర్చడం ,జాతీయ మధుమేహ విధానాలను అభివృద్ధి చేయాలని ప్రపంచ దేశాలను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ‘( కోరుతోంది.

## హైదరాబాద్ ఉప్పల్ రింగ్ రోడ్డు దగ్గర తగలబడ్డ కారు..భారీగా ట్రాఫిక్ జామ్



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ ఉప్పల్ రింగ్ రోడ్డు దగ్గర కారు తగలబడింది. ఉప్పల్ నుంచి తార్నక వస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. కారులో ఉన్నవాళ్లు అప్రమత్తం కావడంతో సురక్షితంగా బయటపడ్డారు. కారు ప్రమాదంతో ఉప్పల్ నుంచి తార్నాక వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.ఘటనా స్థలానికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అయితే కారు పూర్తిగా దగ్ధమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు..కారు ఎవరిది ఏంటనేదానిపై ఆరాదీస్తున్నారు.

## బీసీ వ్యక్తిని తీసేసి.. మీరెందుకు పార్టీ అధ్యక్షుడయ్యారు : పొన్నం



హైదరాబాద్ పెన్ పవర్:కులగణనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణలో తాము చేసింది జనాభా లెక్కలు చేయలేదని .. కులగణన చేశామని అన్నారు. కిషన్ రెడ్డికి ఈ విషయం తెలీక విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. జనాభా లెక్కలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి .. కులాల లెక్కలు తేల్చే అధికారం రాష్ట్రానికి ఉందన్నారు.దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ కుల గణన సర్వే చేసింది.. రాహుల్ డిమాండ్ మేరకే కేంద్రం కులగణన చేస్తామని చెప్పడం కాంగ్రెస్ విజయమని అన్నారు. బీసీ వ్యక్తిని తీసేసి కిషన్ రెడ్డి బీజేపీ అధ్యక్షుడెందుకు అయ్యారో ముందు సమాధానం చెప్పాలన్నారు పొన్నం. సామాజిక పరంగా రాబోయే కాలంలో తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు పోతున్నారు పొన్నం. జస్టిస్ సుదర్శన్ రెడ్డి,కంచె ఐలయ్యలతో కలిసి కమిటీ వేశామని చెప్పారు.

# యుద్ధం వస్తే దేశం విడిచి పారిపోయేందుకు పాక్ నేతలు రెడీగా ఉన్నారు: బీజేపీ నేత వ్యాఖ్యలు



హైదరాబాద్ పెన్ పవర్:పహల్గామ్ ఉగ్రదాడి ఘటన అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ మంత్రులు, ఆ దేశ ఆర్మీ జనరల్స్ భయంతో దేశం విడిచి పారిపోయేందుకు విమాన టిక్కెట్లు బుక్ చేసుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

పహల్గామ్ దాడి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటారోనన్న భయాందోళనలు పాకిస్థాన్ నాయకత్వంలో వ్యక్తమవుతున్నాయని ప్రదీప్ భండారీ అన్నారు. ఈ భయంతోనే పలువురు పాక్ మంత్రులు, ఆర్మీ ఉన్నతాధికారులు తమ కుటుంబాలతో సహా ఇంగ్లాండ్ వంటి విదేశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని ఆయన వివరించారు. "యుద్ధం వస్తే తాము ఇంగ్లాండ్ వెళతామని కొందరు పాక్ నేతలు ఇప్పటికే చెబుతున్నారు" అని భండారీ పేర్కొన్నారు. పాకిస్తాన్ సైన్యంపై గానీ, వారి రక్షణ సామర్థ్యంపైన గానీ ఆ దేశ ప్రజలకే నమ్మకం లేదని భండారీ ఎద్దేవా చేశారు. అందుకే మంత్రులు, కీలక నేతలు ముందుజాగ్రత్తగా విదేశాలకు పయనమయ్యేందుకు టిక్కెట్లు సిద్ధం చేసుకున్నారని ఎత్తిపొడిచారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని భారత్... పాకిస్థాన్‌కు తగిన రీతిలో గట్టి సమాధానం ఇవ్వనుందని భండారీ తెలిపారు. ప్రపంచంలోని ప్రతీ దేశం, ప్రధాని మోదీ తీసుకోబోయే ఏ నిర్ణయానికైనా మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత్ చర్యలకు పాకిస్థాన్ నాయకత్వం భయపడుతోందనడానికి ఇదే నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

# భారత్ మాపై యుద్ధానికి వస్తే నేను ఇంగ్లండ్ వెళ్లిపోతా: పాక్ ఎంపీ వ్యాఖ్యలు



- పహల్గామ్ దాడి తర్వాత భారత్-పాక్ తీవ్ర ఉద్రిక్తతలు
- భారత్‌తో యుద్ధం వస్తే ఇంగ్లాండ్ వెళ్తానన్న పాక్ ఎంపీ మార్వాత్
- మోదీ తన మాట వినరంటూ వ్యంగ్య వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన ఎంపీ వీడియో ఇంటర్వ్యూ

హైదరాబాద్ పెన్ పవర్:పహల్గామ్ ఉగ్రదాడి ఘటనతో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ, పాకిస్తాన్‌కు చెందిన ఓ పార్లమెంట్ సభ్యుడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. భారత్‌తో యుద్ధం వస్తే తాను తుపాకీ పట్టుకుని సరిహద్దుకు వెళ్లను, బదులుగా ఇంగ్లండ్ వెళ్లిపోతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యల వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఇటీవల పహల్గామ్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని భారత్ భావిస్తోంది. ప్రతీకారంగా ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం సహా పలు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ నేతలు కొందరు యుద్ధ సంకేతాలు ఇస్తుండగా, ఎంపీ షేర్ అఫ్జల్ ఖాన్ మార్వాత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

ఓ ఇంటర్వ్యూలో విలేకరి.. "ఒకవేళ భారత్‌తో యుద్ధం వస్తే మీరు తుపాకీ తీసుకుని సరిహద్దుకు వెళతారా?" అని ప్రశ్నించారు. దీనికి మార్వాత్ స్పందిస్తూ, "యుద్ధం మొదలైతే నేను ఇంగ్లండ్‌కు వెళతాను" అని సూటిగా సమాధానమిచ్చారు. అనంతరం, "ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత ప్రధాని మోదీ వెనక్కి తగ్గుతారని మీరు భావిస్తున్నారా?" అని విలేకరి అడగ్గా, మార్వాత్ మరింత వ్యంగ్యంగా బదులిచ్చారు. "నేను చెబితే వినడానికి మోదీ ఏమైనా నా అత్త కొడుకా?" అంటూ వ్యాఖ్యానించారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. పాకిస్తానీ రాజకీయ నాయకులకే వారి సైన్యంపై నమ్మకం లేదని కొందరు, ఇలాంటి నేతలుంటే దేశం పరిస్థితి ఏంటని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.

షేర్ అఫ్జల్ ఖాన్ మార్వాత్... మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్థాపించిన పాకిస్తాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీకి చెందినవారే. అయితే, పార్టీ నాయకత్వంపై, విధానాలపై పలుమార్లు బహిరంగంగా విమర్శలు చేయడంతో ఇటీవల ఇమ్రాన్ ఖాన్ ఆదేశాల మేరకు ఆయన్ను పార్టీ నుంచి తొలగించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.